సాక్షి వికారాబాద్

శుక్రవారం । 10 । ఫిబ్రవరి । 2023



కూరగాయల సాగుపై శిక్షణ

కూరగాయల సాగుపై ధారూరు మండలం కేరెళ్లి రైతు వేదికలో కర్షకులకు రెండు రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. 10లో▸



కనులపండువగా కల్యాణం

చెంగోల్‌లో మల్లికార్జున స్వామి కల్యాణం కనులపండువగా సాగింది. భక్తులు, స్థానికులు స్వామివారిని దర్శించుకున్నారు. 10లో▸



'మనబడి'కి మహర్దశ

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మనబడి కార్యక్రమాలతో పాఠశాలల రూపురేఖలు మారిపోతున్నాయి. 11లో▸

న్యూస్‌రీల్

నేత్ర వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి



కంటి వెలుగు శిబిరంలో వివరాలు తెలుసుకుంటున్న మంజుల

వికారాబాద్ అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల తెలిపారు. పట్టణంలోని శిశుమందిరంలో గురువారం నిర్వహించిన క్యాంప్‌ను సందర్శించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. 18 ఏళ్లు నిండిన వారందరికీ ప్రభుత్వం ఉచితంగా నేత్ర వైద్యం చేయిస్తోందని తెలిపారు. అంధత్వ నివారణే లక్ష్యంగా చేపట్టిన కార్యక్రమం జిల్లా కేంద్రంలో సక్సెస్ ఫుల్‌గా కొనసాగుతోందన్నారు. మున్సిపల్ పరిధిలోని ఆరు వార్డుల్లో వెలుగు కార్యక్రమం విజయవంతమైందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్ రమేశ్‌కుమార్, మెడికల్ ఆఫీసర్ నిఖిల్ తదితరులు ఉన్నారు.


ఆధ్యాత్మిక చింతనతో వ్యసనాలు దూరం



మల్లికార్జునస్వామిని దర్శించుకుంటున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

పరిగి: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్ అన్నారు. పట్టణ కేంద్రంలోని మల్లికార్జునస్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా నిర్వహించిన స్వామివారి పల్లకీ సేవలో పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ భక్తి, సేవా మార్గాలను అనుసరించాలని కోరారు. ముఖ్యంగా యువత భక్తి భావాలను అలవర్చుకుంటే వ్యసనాలకు దూరంగా ఉండే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ భాస్కర్, సీనియర్ నాయకుడు ప్రవీణ్‌రెడ్డి, రఘు, శివస్వాములు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



పులుసుమామిడిలోని పల్లెప్రకృతి వనాన్ని పరిశీలిస్తున్న డీపీఓ తరుణ్‌కుమార్

అనంతగిరి: వికారాబాద్ మండలంలోని పలు గ్రామాల్లో గురువారం జిల్లా పంచాయతీ అధికారి సీహెచ్.తరుణ్‌కుమార్ పర్యటించారు. కామరెడ్డిగూడ, పాతూర్, పులుసుమామిడి, సిద్దులూర్, కొటాలగూడలో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. ఎవెన్యూ ప్లాంటేషన్, నర్సరీ, క్రీడా ప్రాంగణాలను తనిఖీ చేశారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న గడ్డిని తొలగించే మిషన్‌ను కొనుగోలు చేయాలని అధికారులకు సూచించారు. మొక్కలు బాగా ఎదిగేలా సమృద్ధిగా నీళ్లు పోయాలని, వీటి చుట్టూ ఉన్న పిచ్చిమొక్కలు, గడ్డిని తొలగించాలని పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లను ఆదేశించారు. నర్సరీల్లోని మొక్కలు ఎండిపోకుండా చూడాలన్నారు. ఎంపీడీఓ సత్తయ్య, ఎంపీఓ నాగరాజు, ఈసీ నవీన్‌కుమా ర్, టీఏ రాజు, పంచాయతీ కార్యదర్శులు రాములు, మధుకర్ రెడ్డి, సుప్రియ, శిల్ప తదితరులు ఉన్నారు.

ఈ- శ్రామ్ కార్డుల పంపిణీ



చెంగోల్‌లో కార్డులు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

తాండూరు రూరల్: మండల పరిధిలోని చెంగోల్‌లో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి వడ్ల విజయ్‌కుమార్ గురువారం పీఎం జీవన్ సురక్ష ఈ- శ్రామ్ కార్డులు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఈ శ్రామ్ కార్డుల ద్వారా బీమా చేయించుకోవాలని అసంఘటిత కార్మికులకు సూచించారు.

'మల్టీ' లాస్!



పదోన్నతుల ప్రక్రియలో మన సార్లకు అన్యాయం

- పక్క జిల్లాల జీహెచ్‌ఎంలతో నిండిపోనున్న స్కూళ్లు
- గెజిటెడ్ హెచ్‌ఎం పోస్టును మల్టీ జోనల్‌గా పరిగణించడమే కారణం
- చిన్న జిల్లాలతో ఒరిగిందేమిటని టీచర్ల ఆవేదన
- ప్రభుత్వం స్పందించాలని అభ్యర్థన
- 317 జీఓతో రంగారెడ్డికి వెళ్లిన వారిదే అదృష్టం

వికారాబాద్: ప్రమోషన్ల ప్రక్రియలో స్థానిక ఉపాధ్యాయులకు తీరని అన్యాయం జరుగుతోంది. జిల్లాలో ఖాళీగా ఉన్న పోస్టులన్నింటినీ పక్క జిల్లాల టీచర్లు ఎగరేసుకుపోనున్నారు. వీటిలో కనీసం పది శాతం కూడా జిల్లా వాసులకు దక్కే పరిస్థితి లేదు. ఇప్పటి వరకు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల జీహెచ్‌ఎంలు అందరూ స్థానికులే ఉండగా.. ప్రస్తుత పదోన్నతులు ముగిసిన వెంటనే సగానికి పైగా హైస్కూళ్లు పక్క జిల్లాల వారితో నిండిపోనున్నాయి. జిల్లాలు, జోన్ల పునర్విభజన తర్వాత గెజిటెడ్ హెచ్‌ఎం పోస్టు మల్టీ జోన్ పరిధిలోకి వెళ్లింది. దీనికితోడు సీనియారిటీలో మన జిల్లాకు చెందిన స్కూల్ అసిస్టెంట్లు వెనకబడి ఉండటంతో ఈ పరిస్థితి నెలకొంటోంది. ప్రమోషన్ల కోసం ఏళ్ల తరబడి ఎదురు చూసిన స్థానిక ఉపాధ్యాయులకు నిరాశే మిగలనుంది.

మల్టీ జోనల్ ఎఫెక్ట్

ఎస్‌ఏ పదోన్నతుల ప్రక్రియ ఈనెల 16నుంచి ప్రారంభం కానుండగా ఇప్పటికే వెబ్ ఆప్షన్లు ఎంచుకున్నారు. గెజిటెడ్ హెచ్‌ఎం పోస్టులు గతంలో జిల్లా పరిధిలో ఉండగా.. ప్రస్తుతం మల్టీ జోనల్‌లోకి వెళ్లాయి. దీంతో ఉమ్మడి రంగారెడ్డి, ఉమ్మడి నల్గొండ, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలకు చెందిన స్కూల్ అసిస్టెంట్లు అందరూ ఈ పోస్టుల కోసం పోటీ పడనున్నారు. ఫలితంగా స్థానికులు నష్టపోయే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం జిల్లాలో 92 జీహెచ్‌ఎం పోస్టులు ఖాళీగా ఉండగా.. సీనియారిటీ ప్రాతిపదికన చూస్తే 8నుంచి 10 పోస్టులు మాత్రమే స్థానిక టీచర్లకు దక్కనున్నాయి. మిగిలిన 82 స్కూళ్లలో ఉమ్మడి నల్గొండ, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలకు చెందిన వారు కొలువుదీరనున్నారు. ఈ విషయంలో ప్రభుత్వం స్పందించి స్థానికులకు అన్యాయం జరగకుండా చూడాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

లక్కంటే వీరిదే..

ఆర్నెళ్ల క్రితం 317 జీఓను తీసుకువచ్చిన ప్రభుత్వం ..కొత్తగా ఏర్పడిన జిల్లాలకు ఉద్యోగుల పంపకాలను పూర్తి చేసింది. ఈ సమయంలో ఉమ్మడి జిల్లా పరిధిలోని ఏ జిల్లానైనా ఎంచుకునే అవకాశం ఇచ్చింది. దీంతో చాలా మంది ఉపాధ్యాయులు రంగారెడ్డి జిల్లా పరిధిలోని హెచ్‌ఆర్‌ఏ ప్లేస్‌ల కోసం ఎగబడ్డారు. వీరిలో చాలామందికి సీనియారిటీ లేకపోవటం.. హెచ్‌ఆర్‌ఏ స్థానాల్లో అప్పటికే అనుభవజ్ఞులైన టీచర్లు పాతుకుపోవడంతో.. మంచి ప్లేస్ ఆశించి వికారాబాద్ జిల్లా నుంచి వెళ్లిన వారికి ఆశాభంగం తప్పలేదు. హెచ్‌ఆర్‌ఏ స్థానాలు పక్కన బెడితే రంగారెడ్డి జిల్లా పరిధిలోని రూరల్ మండలాలకు చెందిన సుదూర ప్రాంత పాఠశాలలకు కేటాయింపబడ్డారు. దీంతో ఏంచేయాలో పాలుపోక ఉసూరుమంటున్న సమయంలో మ్యూచ్‌వల్ బదిలీలకు అవకాశం కల్పించడంతో ఎగిరి గంతేశారు. ఇదే సమయంలో రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల నుంచి వచ్చి వికారాబాద్‌లోని మారుమూల స్కూళ్లలో విధులు నిర్వహిస్తున్న టీచర్లు వారి సొంత జిల్లాలకు వెళ్లేందుకు ఎగబడ్డారు. ఇదే అవకాశంగా భావించిన రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో ఉన్న మన జిల్లా టీచర్లు..ఇక్కడ పనిచేస్తున్న వారితో బేరసారాలు ప్రారంభించారు. మ్యూచ్‌వల్ కావాలన్న వారినుంచి రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షలు తీసుకుని తిరిగి సొంత జిల్లాకు వచ్చారు. అయితే జిల్లా, పట్టణ కేంద్రాలకు దూరంగా పోస్టింగులు వచ్చాయని బాధపడుతుండగా.. ఏడాది తిరగక ముందే వీరికి మళ్లీ బదిలీ అవకాశం ఇవ్వడంతో అన్నిరకాలుగా లబ్ధి పొందినట్లైయ్యింది.

జిల్లా పోస్టుగా మార్చాలి



గతంలో ఉమ్మడి జిల్లాగా ఉన్నప్పుడు.. ట్రైన్డ్ అభ్యర్థుల కొరత ఉన్న సమయంలోనూ అప్పటి ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ పెద్దలు జిల్లా వాసులకు అన్యాయం జరగకుండా చూశారు. స్పెషల్‌గా అన్ ట్రైన్డ్ డీఎస్సీ వేసి జిల్లా వాసులనే రిక్రూట్ చేసి ఆ తర్వాత శిక్షణ ఇచ్చారు. ఇలా స్థానికులకు అన్యాయం జరగకుండా చూశారు. ఇప్పుడు కూడా గెజిటెడ్ హెచ్‌ఎం పోస్టును మల్టీ జోనల్ కాకుండా, జిల్లా పోస్టుగా పరిగణించాలి. లేదంటే మెజార్టీ స్కూళ్లు పక్క జిల్లాల హెచ్‌ఎంలతో నిండిపోతాయి.

– అమర్‌నాథ్,
పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

ఎక్కడ చదివామన్నది కాదు..

- ఏ స్థాయికి చేరామనేదే ముఖ్యం
- ఉద్యోగ సాధనలో ఇబ్బందులను లెక్కచేయొద్దు
- నిరుద్యోగ యువతకు కలెక్టర్ నారాయణరెడ్డి దిశానిర్దేశం
- ఉచిత శిక్షణ శిబిరం ప్రారంభం

వికారాబాద్ అర్బన్: ఎక్కడ చదివామన్నది ముఖ్యం కాదని.. ఏ స్థాయికి ఎదిగామన్నదే ప్రధానమని కలెక్టర్ నారాయణరెడ్డి నిరుద్యోగ యువతకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన ఎంతో మంది ఉన్నత ఉద్యోగాలు చేస్తున్నారని తెలిపారు. షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత శిక్షణ శిబిరాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. ఆత్మ విశ్వాసం, కష్టపడే స్వభావం ఉంటే ఏదైనా సాధించవచ్చని తెలిపారు. గ్రూప్‌- 2, 4 ఉద్యోగాల కోసం పోటీ పడుతున్న యువతకు స్థానిక అంబేడ్కర్ భవన్‌లో ఫ్రీ కోచింగ్ ఇస్తున్నారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఒకేసారి 96వేల ఉద్యోగాలను భర్తీ చేసేందుకు కృషి చేస్తోందని తెలిపారు. వీటి కోసం సుమారు 25లక్షల మంది పోటీ పడనున్నారని స్పష్టంచేశారు. ఎక్కువ కాంపిటేషన్ ఉందనే విషయాన్ని పక్కన పెట్టి, ఆత్మవిశ్వాసంతో సాధన చేయాలన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న సమయంలో అనేక ఇబ్బందులు వస్తాయని, వీటిని లెక్కచేయకుండా లక్ష్యం వైపు సాగిన వారే విజయం సాధిస్తారని తెలిపారు. నిజాయితీగా కష్టపడితే ఫలితం తప్పకుండా ఉంటుందన్నారు. ఉద్యోగ సాధనలో ప్రణాళిక అతి ప్రధానమని తెలిపారు. సమయాన్ని వృథా చేయకుండా ప్లాన్ ప్రకారం ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి మల్లేశం, ఏఎ స్ డబ్ల్యూఓలు ఉమాపతి, వీరానందం, ఎంపీడీఓ సత్తయ్య, లెక్చరర్ సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

పోడు ప్రక్రియను వేగిరం చేయండి

పోడు భూముల పట్టాల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు గురువారం తన కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా 426 దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, కమిటీ ఆమోదంతో అర్హులైన వారికి పట్టాలు అందజేస్తామని తెలిపారు. 2005 డిసెంబర్ 13కు ముందు పోడు భూములను సాగు చేసుకుంటున్న గిరిజన రైతులకు న్యాయం చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అటవీ సంపదను కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని తెలిపారు. ఈ నెల 13నుంచి 17వ తేదీలోపు పోడు భూముల ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ రాహుల్ శర్మ, డీఆర్‌ఓ అశోక్‌కుమార్, గిరిజన సంక్షేమ శాఖ అధికారి కోటాజీ, వికారాబాద్ ఆర్డీఓ విజయ కుమారి పాల్గొన్నారు.

అనంతగిరిని అభివృద్ధి చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనంద్

- అసెంబ్లీలో ఎమ్మెల్యే ఆనంద్
- వికారాబాద్‌కు నర్సింగ్ కళాశాల మంజూరు చేయాలి

అనంతగిరి: వికారాబాద్‌కు సమీపంలోని అనంతగిరిగుట్ట శ్రీ అనంతపద్మనాభ స్వామి ఆలయాన్ని అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ కోరారు. గురువారం ఆయన అసెంబ్లీలో ఈ విషయాన్ని ప్రస్తావించారు. అనంతగిరికి రోజురోజుకు భక్తుల రద్దీ పెరిగిందని, దీంతో పర్యాటకంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. మెడికల్ కళాశాల ఏర్పాటు చేసినందుకు ప్రభుత్వానికి, సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపిన ఆయన.. వికారాబాద్‌కు నర్సింగ్ కళాశాల మంజూరు చేయాలని కోరారు. వికారాబాద్‌లో స్టేడియం, మర్పల్లిలో మినీస్టేడియం నిర్మించాలన్నారు. మోమిన్‌పేట-బంట్వారం మధ్యలో 32 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. ధారూరులో సెంట్రల్ లైటింగ్, డివైడర్ ఏర్పాటు చేయాలన్నారు. బార్వాద్-మాలసోమారం మధ్యలో, అలాగే మోమిన్‌పేట మండలం టేకులపల్లి సమీపంలో వంతెనలు నిర్మించాలని కోరారు. మర్పల్లిలో రోడ్లు, డివైడర్, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. వికారాబాద్ జిల్లా కేంద్రాన్ని కలుపుతూ గోధుమగూడ-నాగారం వరకు, అలాగే వికారాబాద్-మైలార్‌దేవరాంపల్లి-జిన్నారం వరకు డబుల్ రోడ్డు వేయాలని ఎమ్మెల్యే కోరారు.



కొడంగల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల



కాలేజీలోని బోటనీ ల్యాబ్

'బి' హ్యాపీ

- కొడంగల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు న్యాక్ గుర్తింపు
- జిల్లాలోని కాలేజీకి తొలిసారి దక్కిన గౌరవం
- అభివృద్ధి, వసతుల కల్పనకు రూ.3 కోట్ల రూసా నిధులు
- హర్షం వ్యక్తంచేస్తున్న విద్యార్థులు, సిబ్బంది
- 'ఏ' గ్రేడ్ సాధనే తదుపరి లక్ష్యం

కొడంగల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ప్రత్యేక స్థానం లభించింది.. జిల్లాలో న్యాక్ (నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రెడిటేషన్ కౌన్సిల్) గుర్తింపు దక్కిన తొలి కళాశాలగా గుర్తింపు పొందింది. జిల్లాలోని వికారాబాద్, పరిగి, తాండూరు, కొడంగల్ నియోజకవర్గ కేంద్రాల్లో సర్కారు డిగ్రీ కాలేజీలున్నాయి. వీటన్నింటిలో కొడంగల్ కళాశాల బాగుందని న్యాక్ బృందం సభ్యులు ప్రకటించారు. ఇక్కడ ఉన్నత ప్రమాణాలతో మెరుగైన విద్యాబోధన చేస్తున్నారని స్పష్టంచేశారు. న్యాక్ గుర్తింపులో బీ గ్రేడ్ సాధించినట్లు వెల్లడించారు. ఈ కళాశాలలో చదివిన విద్యార్థులకు ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాల్లో ప్రాధాన్యత లభిస్తుందని ఉన్నత విద్యాశాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ డీఎస్‌ఆర్ రాజేందర్‌సింగ్ తెలిపారు. విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలకు ప్రత్యేక గుర్తింపు ఉంటుందన్నారు. కళాశాల అధ్యాపకులను అభినందించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి పారితోషికంగా రూ.3 కోట్ల రూసా నిధులు వస్తాయని తెలిపారు. కళాశాల అభివృద్ధి, సదుపాయాల కల్పన, అదనపు తరగతి గదుల నిర్మాణం, ల్యాబ్ పరికరాల కొనుగోలు తదితర అవసరాలకు ఈ నిధులు ఎంతగానో ఉపయోగపడుతాయని చెప్పారు. ఉన్నత విద్యాశాఖ కమిషనర్ నవీన్ మిట్టల్ సహకారంతో కళాశాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఇదిలా ఉండగా న్యాక్ గుర్తింపుపై విద్యార్థులు, సిబ్బంది హర్షం వ్యక్తంచేస్తున్నారు.

ఐదేళ్లకోసారి పరిశీలన

న్యాక్ ప్రధాన కార్యాలయం బెంగళూరులో ఉంది. దేశ వ్యాప్తంగా నిష్ణాతులైన విద్యావంతులతో కమిటీ ఏర్పాటు చేసి ప్రభుత్వ కళాశాలలను తనిఖీ చేస్తారు. విద్యాబోధన, మౌలిక సదుపాయాలు, విద్యార్థుల విషయ పరిజ్ఞానం, అధ్యాపకుల పనితీరు, సొంత భవనం, తరగతి గదులను పరిశీలించి నివేదిక సిద్ధం చేస్తారు. దీని ఆధారంగా ఆయా కాలేజీలకు గ్రేడ్ పాయింట్లు కేటాయిస్తారు. ఐదేళ్లకోసారి న్యాక్ పరిశీలన జరుగుతుంది. జిల్లాలో మొదటగా కొడంగల్ కళాశాలకు బీ గ్రేడ్ వచ్చింది. భవిష్యత్తులో ఏ గ్రేడు సాధించే విధంగా అధ్యాపకులు, విద్యార్థులు కృషి చేయాల్సిన అవసరం ఉంది.

పీజీ కాలేజీ మంజూరుకు కృషి..

తెలంగాణ ఉన్నత విద్య జాయింట్ డైరెక్టర్ డాక్టర్ డీఎస్‌ఆర్ రాజేందర్ సింగ్ గురువారం 'సాక్షి'తో ఫోన్‌లో మాట్లాడారు. కొడంగల్ నియోజకవర్గంలోని దౌల్తాబాద్ మండలం ఆయన స్వస్థలం. ఈ నేపథ్యంలో కొడంగల్‌పై ఆయనకు ప్రత్యేక అభిమానం ఉంది. కొడంగల్‌కు పీజీ కళాశాల మంజూరు చేయించేందుకు తనవంతు కృషిచేస్తానని చెప్పారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో కొత్త కోర్సులు ప్రవేశపెట్టినట్లు తెలిపారు. 50 రకాల కాంబినేషన్ కోర్సులతో మెరుగైన విద్య అందిస్తామన్నారు. డెయిరీ టెక్నాలజీ, సెరికల్చర్, మైక్రోబయాలజీ, బీఎస్సీ కంప్యూటర్స్, బీకాం కంప్యూటర్స్, బీబీఏ గేమింగ్, బీఎస్సీ హానర్స్, మిషన్ లర్నింగ్, డాటా సైన్స్ తదితర కొత్త కోర్సులు ప్రవేశపెట్టినట్లు తెలిపారు. విద్యార్థులు ప్రభుత్వ కళాశాలల్లో చదివి ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు.

పేదల అభ్యున్నతే ఎజెండా



కుల్కచర్ల చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరేస్తున్న డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్ రెడ్డి

కుల్కచర్ల: పేద ప్రజల అభ్యున్నతికి కృషి చేసేది కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రామ్మోహన్ రెడ్డి అన్నారు. గురువారం కుల్కచర్ల మండల కేంద్రంలో కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు కల్లబొల్లి మాటలతో ప్రజలను వంచిస్తున్నారని, వాస్తవంగా క్షేత్ర స్థాయిలో ప్రజలకు ఎలాంటి లబ్ధిచేకూరడం లేదన్నారు. తమ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన జోడోయాత్ర కార్యక్రమ లక్ష్యాన్ని, ఉద్దేశాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకే హాత్ సే హాత్ జోడో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యకర్తలు భయపడాల్సిన అవసరం లేదని పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కుల్కచర్ల మండల పరిధిలోని లింగంపల్లి నుంచి ప్రారంభమైన యాత్ర తిర్మలాపూర్ మీదుగా కుల్కచర్లకు , అక్కడి నుంచి అంతారం, పుట్టపహాడ్ గ్రామం మీదుగా మహ్మదాబాద్ మండలానికి యాత్ర చేరుకుంది. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, కుల్కచర్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆంజనేయులు, కుల్కచర్ల ఎంపీటీసీ ఆనందం, పరిగి బ్లాక్ టూ అధ్యక్షుడు భరత్ కుమార్, నాయకులు నర్సింహనాయక్, లక్ష్మీఆనంద్, రాధారెడ్డి, మోత్కూరు వెంకటేశ్, సోమలింగం, లింగంపల్లి శ్రీశైలం, శివరాములు, భాస్కర్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్, బీజేపీ కుట్రలను తిప్పికొడదాం

పూడూరు: బీఆర్‌ఎస్, బీజేపీ చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలని డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన మండల పరిధిలోని ఎన్కేపల్లి ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి హాత్‌సే హాత్‌జోడో కార్యక్రమాన్ని ప్రారంభించారు. వందలాది వాహనాలతో భారీ ర్యాలీగా వచ్చి మన్నెగూడ, పూడూరు మండల కేంద్రంలో పార్టీ జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు చేపట్టిన పథకాలను వివరించాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సతీశ్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు సురేందర్, డీసీసీ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, రఘునాథ్‌రెడ్డి, శకీల్, పెంటయ్య, డీసీసీ కార్యదర్శి హనుమంతు ముదిరాజ్ పాల్గొన్నారు.

బైపాస్ పనులు వేగిరం

- రోడ్డు నిర్మాణానికి కొలతలు తీసుకున్న అధికారులు
- భూ బాధితుల వివరాల సేకరణ

కొడంగల్: బైపాస్ నిర్మాణ పనులు వేగం పుంజుకున్నాయి. రెవెన్యూ ఉద్యోగులు, సర్వేయర్లు గురువారం కొలతలు తీసుకున్నారు. భూములు కోల్పోతున్న రైతుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. కొడంగల్‌లో నాలుగు కిలోమీటర్ల పొడవునా ఈ రహదారిని నిర్మించనున్నారు. ఇందుకు సంబంధించిన రూట్ మ్యాప్‌ను ఇప్పటికే ఖరారు చేశారు. ఎటునుంచి ఎటు వైపు బైపాస్ నిర్మించాలనే విషయంలో ఆర్అండ్‌బీ అధికారులు ఓ నిర్ణయానికి వచ్చారు. త్వరలో టెండర్లు పూర్తి చేసి, భూసేకరణకు సిద్ధం కావాలని భావిస్తున్నారు. మహబూబ్‌నగర్- చించోలి జాతీయ రహదారి నిర్మాణం భాగంగా పట్టణ శివారు నుంచి బైపాస్‌ను నిర్మించనున్నారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం రూ.630 కోట్లు మంజూరు చేసిన విషయం తెలిసిందే. ఇందులో రోడ్డు నిర్మాణానికి రూ.480 కోట్లు, మిగిలిన రూ.150 కోట్లు భూ సేకరణ కోసం వెచ్చిస్తారు.

క్లుప్తంగా

డీఎఫ్‌ఓ వెంకటేశ్వర్‌రెడ్డి బదిలీ



అనంతగిరి: డీఎఫ్‌ఓ వెంకటేశ్వర్‌రెడ్డిని బదిలీ అయ్యారు. నగరంలోని అటవీ శాఖ ప్రధాన కార్యాలయంలో యుటిలైజేషన్ విభాగానికి ట్రాన్స్‌ఫర్ చేశారు. ఐదు నెలల క్రితమే బదిలీపై ఇక్కడకు వచ్చిన ఆయన విధుల్లో నిక్కచ్చిగా వ్యవహరించారు. అటవీ భూముల పరిరక్షణ విషయంలో కొంత కఠినంగా వ్యవహరించి, స్ట్రిక్ట్ ఆఫీసర్‌గా పేరు తెచ్చుకున్నారు.

ట్రాక్టర్, బైక్ ఢీకొని వ్యక్తి మృతి



అంజిలయ్య మృతదేహం

కుల్కచర్ల: ట్రాక్టర్, బైక్ ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. గురువారం రాంరెడ్డిపల్లికి చెందిన బోయిని అంజిలయ్య(40) బండవెల్కిచర్ల నుంచి బైక్‌పై కులకచర్ల వైపు వస్తుండగా ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. 108లో పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా వైద్యులు అప్పటికే మృతిచెందినట్లుగా పేర్కొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన బార్ అసోసియేషన్ ప్రతినిధులు



అనంతగిరి: కలెక్టర్‌ను వికారాబాద్ బార్ అసోసియేషన్ ప్రతినిధులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కోర్టు సమస్యలు, నూతన జిల్లా కోర్టు భవనం నిర్మించేందుకు అనువైన స్థలం, ప్రజలకు అధికారులకు అందుబాటులో ఉండే స్థలం కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మాధవరెడ్డి, ప్రధాన కార్యదర్శి జగన్, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

ఉపగ్రహ వాహక నౌకపై అవగాహన

- విద్యార్థులకు వివరించిన శాస్త్రవేత్త రఘునందన్
- నాదర్‌గుల్ పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమం
- లాంచ్ వెహికల్‌ను తిలకించేందుకు ఏర్పాట్లు

బడంగ్‌పేట్: ఉపగ్రహ వాహక నౌక పనితీరుపై మండలంలోని నాదర్‌గుల్ వంశీధర్ స్కూల్ విద్యార్థులకు ప్లానిటరీ సొసైటీ ఆఫ్ ఇండియా డైరెక్టర్, శాస్త్రవేత్త రఘునందన్ అవగాహన కల్పించారు. శుక్రవారం భారత్ ప్రయోగించనున్న మూడు ఉపగ్రహాల గురించి గురువారం పాఠశాల విద్యార్థులకు వివరించారు. ఉపగ్రహాలను నింగిలోకి తీసుకెళ్లే స్మాల్ శాటిలైట్ లాంచ్ వెహికల్ గురించి తెలియజేశారు. ఉదయం 9గంటల 18 నిమిషాలకు ఎస్ఎస్ఎల్‌వీ నింగిలోకి దూసుకుపోతుందన్నారు. 450 కిలోల బరువు గల 3 ఉపగ్రహాలను ఈ వెహికల్ 11 నిమిషాల్లో కక్ష్యలో ప్రవేశ పెడుతుందని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు వివరించారు. జానూస్ (జేఏఎన్‌యూఎస్)-01, అలాగే అజాదీ షాట్ -02, ఈఓఎస్ -07 అనే మూడు ఉపగ్రహాలు నిర్దేశించిన కక్ష్య నుంచి భూ గ్రహాన్ని పరిశీలిస్తాయని తెలిపారు. అనంతరం విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు రఘునందన్ విలువైన సమాధానాలు ఇచ్చి వారిని ప్రోత్సహించారు. శుక్రవారం ఉపగ్రహాలను నింగిలోకి ప్రవేశపెట్టనున్న ఎస్ఎస్ఎల్‌వీ లాంచ్ వెహికల్‌ను విద్యార్థులు ప్రత్యక్షంగా తిలకించేందుకు ఆయా తరగతి గదుల్లో స్క్రీన్లు ఏర్పాట్లు చేసినట్లు పాఠశాల యాజమాన్యం తెలిపింది. జీవన గమ్యాలను నిర్ధారించుకునే విధంగా విద్యార్థులను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, సిబ్బంది గోదాలక్ష్మీ, ప్రిన్సిపాల్, అడ్మినిస్ట్రేటివ్ అధికారి మధుసూదన్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



భవాని కాలేజ్ జట్టు



ఎమ్ఎల్ఆర్ ఇనిస్టిట్యూట్ జట్టు

హోరాహోరీగా ‘సాక్షి’ ప్రీమియర్ లీగ్ పోటీలు

నేటి ఉదయం సెమీ ఫైనల్..మధ్యాహ్నం ఫైనల్స్

SPL SAKSHI PREMIER LEAGUE

SAKSHI | సాక్షి | SAKSHI DIGITAL MEDIA GROUP

పోచారం: ఘట్‌కేసర్ మండలం ప్రతాపసింగారంలోని బాబురావు సాగర్ క్రికెట్ మైదానంలో సాక్షి యాజమాన్యం నిర్వహిస్తున్న సాక్షి ప్రీమియర్ లీగ్–4 మ్యాచ్‌లు గురువారం హోరాహోరీగా కొనసాగాయి. ఇందులో గ్రేటర్ హైదరాబాద్ నుండి 65 జట్లు పాల్గొంటున్నాయి.

విజేతలు వీరే..

బాబూరావు సాగర్ క్రికెట్ మైదానం – 1

- మొదటి మ్యాచ్‌లో వేద డిగ్రీ కాలేజ్ జట్టు 10 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 107 పరుగులు చేసింది. అనంతరం లయోలా డిగ్రీ కాలేజ్ జట్టు 9.2 ఓవర్లలో 10 వికెట్లు కోల్పోయి 74 పరుగులే చేసి ఓడిపోయింది.
- రెండో మ్యాచ్‌లో శ్రీ ఇందు ఇంజినీరింగ్ కళాశాల ఏ జట్టు 10 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 89 పరుగులు చేసింది. అనంతరం భవన్స్ వివేకానంద డిగ్రీ కళాశాల జట్టు 7 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 90 పరుగులు తీసి శ్రీఇందుపై విజయం సాధించింది. భవన్స్ బ్యాట్స్‌మెన్ నితీష్ 15 బంతుల్లో 30 పరుగులు తీసి ప్రతిభ చాటుకున్నాడు.
- మూడో మ్యాచ్‌లో జేఎన్‌టీయూ సుల్తాన్‌పూర్ జట్టు 10 ఓవర్లలో 57 పరుగులు చేసి ఆలౌట్ అయింది. ఈ జట్టుపై భవన్స్ ఏ జట్టు 2 వికెట్లు కోల్పోయి 6 ఓవర్లలో 58 పరుగులు చేసి సెమీ ఫైనల్‌కు చేరింది.

బాబూరావు సాగర్ క్రికెట్ మైదానం–2

- మొదటి మ్యాచ్‌లో జేఎన్‌టీయూ సుల్తాన్‌పూర్ జట్టు 10 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 69 పరుగులు చేసింది. ఈ జట్టుతో తలపడిన విజ్ఞాన భారతి ఇంజినీరింగ్ కళాశాల జట్టు 10 ఓవర్లలో 51 పరుగులు మాత్రమే చేసి ఓటమి నమోదు చేసింది.
- రెండో మ్యాచ్‌లో ఎమ్ఎల్ఆర్ఐటీ దుండిగల్ జట్టు 10 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 122 పరుగులు చేసింది. ఇందులో బ్యాట్స్‌మ్యాన్ నితిన్ 35 బంతుల్లో 99 పరుగులు తీసి సత్తా చాటారు. దీనిపై ఎమ్ఆర్ఈసీ ఏ జట్టు ఆడి 10 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 97 పరుగులు చేసి ఓటమి పాలైంది.

నేటి మ్యాచ్‌లు..

- శుక్రవారం సీనియర్ విభాగంలో ఎమ్ఎల్ఆర్ ఐటీ వర్సెస్ వేద డిగ్రీ కాలేజ్, ఎస్‌పీ కాలేజ్ వర్సెస్ భవన్స్ వివేకానంద డిగ్రీ కాలేజ్ జట్ల మధ్య సెమీ ఫైనల్స్ జరుగుతాయి. జూనియర్ విభాగంలో భవన్స్ శ్రీ అరబిందో జూనియర్ కళాశాల వర్సెస్ గౌతమ్ జూనియర్ కాలేజ్ ఈసీఐఎల్ జట్లు ఫైనల్స్‌లో తలపడుతాయి.

కూరగాయల సాగుపై శిక్షణ



ఉల్లి పంటను పరిశీలిస్తున్న అధికారులు

ధారూరు: మండల పరిధిలోని కేరెల్లి రైతువేదికలో రెండు రోజులుగా యాసంగిలో కూరగాయల సాగుపై రైతులకు శిక్షణ ఇచ్చారు. సమగ్ర సస్య రక్షణ కేంద్రం హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో కూరగాయల సాగులో మెలకువలను సస్య రక్షణ కేంద్రం సునీత వివరించారు. సస్య రక్షణ పద్ధతులు తప్పనిసరి అని అన్నారు. అనంతరం పంటలను సందర్శించి లింగాకర్షక బుట్టల వినియోగం గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో కేంద్ర సమగ్ర సస్యరక్షణ డిప్యూటీ డైరెక్టర్ ఎం. కృష్ణారెడ్డి, తాండూరు వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు నీలారాణి, యమున, సర్పంచులు, వ్యవసాయ, ఉద్యానవన అధికారులు, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు చైర్‌పర్సన్ సన్మానం

అధికార, విపక్ష కౌన్సిలర్ల హాజరు



కలెక్టర్‌ను సన్మానిస్తున్న నాయకులు

వికారాబాద్ అర్బన్: కలెక్టర్ నారాయణరెడ్డిని వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, వైస్ చైర్‌పర్సన్ శంషాద్ బేగం గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారి వెంట కౌన్సిలర్లు గాయత్రి లక్ష్మణ్, మోముల స్వాతి, అనంతలక్ష్మి, చందర్ నాయక్, బీజేపీ కౌన్సిలర్ శ్రీదేవి, కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ సుధాకర్ రెడ్డి, కౌన్సిలర్ దేవి కూడా ఉన్నారు. అధికార పార్టీ బీఆర్ఎస్ కౌన్సిలర్లు అవిశ్వాసం తలపెట్టిన వేళ.. చైర్‌పర్సన్ సొంత పార్టీ కౌన్సిలర్లతో పాటు, కాంగ్రెస్, బీజేపీ కౌన్సిలర్లను వెంట పెట్టుకొని కలెక్టర్‌ను కలవడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ విషయంపై కౌన్సిలర్లను సంప్రదించంగా.. కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగానే కలిసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ వైస్ చైర్మన్ రమేశ్ కుమార్, మాజీ జెడ్పీటీసీ ముక్తార్ షరీఫ్ ఉన్నారు.

జిప్సం ఫ్యాక్టరీపై ‘మానవ హక్కుల’కు ఫిర్యాదు



మానవ హక్కుల సంఘానికి ఫిర్యాదు చేసిన గుంతబాసుపల్లి సర్పంచ్ జగదీశ్

తాండూరు రూరల్: గుంతబాసుపల్లి శివారులో ఉన్న ఇండస్ కెమ్ జిప్సం ఫ్యాక్టరీపై మానవ హక్కుల సంఘానికి గురువారం ఫిర్యాదు చేసినట్లు గ్రామ సర్పంచ్ జగదీశ్ తెలిపారు. నగరంలోని మానవ హక్కుల కమిషన్‌ను కలిసి తమ గోడును విన్నవించామన్నారు. ఫ్యాక్టరీ నుంచి వచ్చే కాలుష్యంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. దుర్వాసన వస్తుండటంతో ప్రజలు రోగాలబారిన పడుతున్నారని వివరించినట్లు చెప్పారు.

ఫ్యాక్టరీ సీజ్ చేయాలని ఎమ్మెల్యే ఆదేశం..

జిప్సం ఫ్యాక్టరీని వెంటనే సీజ్ చేయాలని ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి అధికారులను ఆదేశించినట్లు సర్పంచ్ జగదీశ్ తెలిపారు. మానవ హక్కుల సంఘానికి ఫిర్యాదు అనంతరం ఎమ్మెల్యేను కలిసినట్లు చెప్పారు. వెంటనే కాలుష్య నియంత్రణ మండలి ఏఈ సిద్ధార్థతో ఎమ్మెల్యేతో ఫోన్‌లో మాట్లాడారు. అనంతరం ఆర్డీఓ అశోక్‌కుమార్‌తో మాట్లాడి వెంటనే జిప్సం ఫ్యాక్టరీని సీజ్ చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. కలెక్టర్ సైతం ఈ విషయంపై ప్రత్యేక చొరవ చూపి, ఫ్యాక్టరీని సీజ్ చేసేందుకు చర్యలు చేపట్టాలని సర్పంచ్ కోరారు.

అందరికీ రుణాలివ్వాల్సిందే

- లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను అడ్డుకున్న మైనారిటీలు
- వాయిదా వేసిన అధికారులు



మైనారిటీలతో మాట్లాడుతున్న సీఐ అప్పయ్య

ధారూరు: అర్హులందరికీ రుణాలివ్వాల్సిందేనంటూ మైనారిటీలు ఆందోళనకు దిగారు. 376 మంది దరఖాస్తు చేసుకుంటే ఐదుగురికే ఇవ్వడం ఏమిటంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను నిలిపివేయించారు. మండల కేంద్రంలో గురువారం మైనారిటీ కార్పొరేషన్ ద్వారా రుణాలు ఇచ్చేందుకు అధికారులు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను చేపట్టారు. ఈ రుణాల కోసం 376 మంది దరఖాస్తు చేసుకున్నారు. లాటరీ పద్ధతిలో ఐదుగురినే ఎంపిక చేస్తుండటంతో మిగతా వారు వచ్చి ఎంపిక ప్రక్రియను ఆపాలని అడ్డుకుని ఆందోళనకు దిగారు. విషయం తెలిసి సీఐ అప్పయ్య, ఎస్ఐ నరేందర్ సిబ్బందితో అక్కడికి చేరుకుని ఆందోళనకారులను శాంతింపజేసేందుకు యత్నించారు. కానీ ససేమిరా అనడంతో ఎంపిక ప్రక్రియను నిలిపివేస్తున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ పేర్కొన్నారు. మళ్లీ ఎప్పుడు నిర్వహించేది తర్వాత ప్రకటిస్తామని తెలిపారు. నిరసన తెలిపిన వారిలో మాజీ కోఆప్షన్ సభ్యుడు హఫీజ్, మైనారిటీలు మోసీన్‌ఖురేషి, సద్దాం, దావూద్, యాకూబ్, ముజాఫర్‌హుస్సేన్, జహీర్, జలీల్, అన్సారీ, హైమద్, నసీర్ తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలపై రాజీలేని పోరాటం



ముజాహిద్‌పూర్ పాఠశాలలో ప్రచారం నిర్వహిస్తున్న కాటెపల్లి జనార్దన్ రెడ్డి

ఎమ్మెల్సీ కాటెపల్లి

కుల్కచర్ల: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్సీ కాటెపల్లి జనార్దన్ రెడ్డి కోరారు. గురువారం మండల పరిధిలోని ముజాహిద్‌పూర్, కుల్కచర్ల జెడ్పీ పాఠశాలలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండు సార్లు తనను గెలిపించినందుకు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఎంతో కృషి చేశానని, భవిష్యత్‌లో కూడా రాజీలేని పోరాటం చేస్తానన్నారు. కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు విజయ్‌శ్రవణ్, పూర్వ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

జైలు శిక్ష

మర్పల్లి: మద్యం సేవించి వాహనం నడిపిన మనోజ్‌కుమార్ అనే వ్యక్తికి వికారాబాద్ జడ్జీ మూడు రోజుల పాటు జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ అరుణ్‌కుమార్ గౌడ్ గురువారం తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు.

భార్యపై అనుమానంతో కొడవలితో దాడి

నవాబుపేట: భార్యపై అనుమానంతో కొడవలితో దాడి చేశాడు భర్త. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కోటిపల్లి మండలం బీరెల్లి గ్రామానికి చెందిన చాకలి నర్సింహులు భార్య నాగమణి పిల్లలతో కలిసి వికారాబాద్ లోని బీటీఎస్ కాలనీలో ఇల్లు అద్దెకు తీసుకొని ఉంటున్నారు. నవాబుపేటకు చెందిన ఓ వ్యక్తి వద్ద తొమ్మిది ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నారు. కొంతకాలంగా నర్సింహులు భార్యపై అనుమానం పెంచుకున్నాడు. గురువారం ఇద్దరు పొలం వద్ద పను లు చేస్తుండగా ఇద్దరూ గొడవపడ్డారు. దాంతో నర్సింహులు తన చేతిలో ఉన్న కొడవలితో దాడి చేశాడు. దాంతో ఆమెకు తీవ్రగాయాలయ్యాయి. ఆమె అరవడంతో చుట్టుపక్కల వా రు వచ్చే సరికి భర్త అక్కడి నుంచి పారిపోయా డు. వెంటనే ఆమెను వికారాబాద్ ఆస్పత్రికి తరలించారు. ఎస్ఐ ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి వివరాలు సేకరించారు. బాధితురాలు వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతు న్నారు. బాధితురాలి కుమారుడు ముకుంద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ భరత్ భూషణ్ తెలిపారు.

ముందస్తు అరెస్టులు అప్రజాస్వామికం

సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్



పోలీసుల అదుపులో శ్రీనివాస్

తాండూరు టౌన్ : సమస్యలపై ఉద్యమిస్తున్న వారిని ముందస్తు అరెస్టు చేయడం అప్రజాస్వామికమని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్ అన్నారు. గురువారం ప్రజా సంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద నిర్వహించతలపెట్టిన ధర్నాకు వెళ్తుండగా తనను అరెస్టు చేయడం సమంజసం కాదన్నారు. అధికారంలోకి వచ్చి ఏళ్లు గడుస్తున్నా సీఎం కేసీఆర్ పేదల ఆర్థికాభివృద్ధి కోసం ఇచ్చిన హామీలు అమలు జరగలేదన్నారు. పేదలకు ఇస్తానని చెప్పిన డబుల్ బెడ్రూం ఇళ్లు, ఖాళీ స్థలంలో ఇల్లు నిర్మించుకోవడానికి రూ. 5లక్షలు వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. సమస్యల పరిష్కారం కోసం ధర్నా చేసేందుకు వెళ్తున్న వారిని అరెస్టులతో అణచివేయడం నిరంకుశత్వమని దుయ్య బట్టారు. పేదల కోసం ఎన్ని అవాంతరాలు ఎదురైనా పోరాటం చేసి తీరుతామన్నారు.

కనులపండువగా కల్యాణం

చెంగోల్‌లో వైభవంగా మల్లికార్జునస్వామి ఉత్సవాలు



శివపార్వతుల కల్యాణం

తాండూరు రూరల్: మల్లికార్జున స్వామి కల్యాణం కనులపండువగా సాగింది. మండల పరిధిలోని చెంగోల్ గ్రామంలో మల్లికార్జునస్వామి దేవాలయం వార్షికోత్సవ ఉత్సవాలు కొనసాగుతున్నాయి. మొదటి రోజు ఆలయం ఎదుట ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. రెండో రోజు గురువారం ఆలయంలో శివపార్వతుల కల్యాణం వైభవంగా జరిగింది. అమ్మవారి తరపున సూర్యవంశి ప్రియపవన్ దంపతులు, స్వామి వారి తరపున చంద్రకళ శంకర్‌యాదవ్ దంపతులు పాల్గొని కల్యాణం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని వీక్షించారు. చెంగోల్ వాస్తవ్యుడు చంద్రకళ శంకర్‌యాదవ్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గౌడి మంజుల, సర్పంచ్ మల్లీశ్వరి, ఎంపీటీసీ రాముర‌త్నమాల, ఆలయ ధర్మకర్త ప్రెసిడెంట్ మేఘమాల, వైస్ ప్రెసిడెంట్ గోపాల్‌రెడ్డి, కోశాధికారి హన్మయ్య,ప్రధాన కార్యదర్శి గౌడి వెంకటేశం, కార్యదర్శి శ్రీనివాస్ దేవాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఎస్పీ కోటిరెడ్డి, స్థానిక నేతలు

- ప్రతిగ్రామంలో ఏర్పాటు తప్పనిసరి
- ఎస్పీ కోటిరెడ్డి

కుల్కచర్ల: నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు ఎంతో కీలకమని ఎస్పీ కోటిరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో 110 సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో సీసీ కెమెరాలు ఎంతో అవసరమన్నారు. సీసీ కెమెరాల వల్ల ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా నియంత్రిస్తుందన్నారు. ప్రతీ గ్రామంలో తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటుచేయాలని, అందుకు ప్రజాప్రతినిధులు, నాయకులు సహకరించాలని కోరారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలు తగ్గుతాయన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ కరుణసాగర్, సీఐ వెంకట్రామయ్య, ఎస్ఐ గిరి, దోమ ఎస్ఐ విశ్వజన్, ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, జెడ్పీటీసీ రాందాస్ నాయక్, బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు ప్రహ్లాదరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శేరిరాంరెడ్డి, వైస్ ఎంపీపీ రాజశేఖర్, రైతుబంధు మండల అధ్యక్షుడు రాజు పాల్గొన్నారు.

అనారోగ్యంతోనే బాలుడు మృతి

తండ్రి వెల్లడి

దోమ : అనారోగ్యంతోనే మా బాలుడు మృతి చెందాడని తండ్రి సంద బీమయ్య వివరించారు. వైద్యం వికటించి మృతి చెందలేదని తెలిపారు. ఈ మేరకు గురువారం బొంపల్లి గ్రామంలో గ్రామ ఎంపీటీసీ రాఘవపురం రాములు, ఉపసర్పంచ్ రఫీక్ పాషతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. తన కుమారుడైన యశ్వంత్(12) కొన్ని రోజులుగా అనారోగ్యానికి గురయ్యాడని తెలిపారు. అయితే ఆర్ఎంపీ డాక్టర్ వైద్యం వికటించి మృతి చెందాడనే వార్తలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారడం దురదృష్టకరమన్నారు.

మినీ అంగన్‌వాడీ టీచర్ల సమస్యలు పరిష్కరించండి

మంత్రి సత్యవతి రాథోడ్‌కు సంఘం నాయకుల వినతి



మంత్రి సత్యవతి రాథోడ్‌ను కలిసి వినతిపత్రం అందజేస్తున్న మినీ అంగన్‌వాడీ సంఘం నాయకులు

చేవెళ్ల: గ్రామాల్లో ఉన్న మినీ అంగన్‌వాడీ టీచర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలని మహిళా శిశుసంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్‌ను అంగన్‌వాడీ టీచర్ల సంఘం నాయకులు కోరారు. గురువారం నగరంలోని మంత్రి సత్యవతి రాథోడ్‌ను కలిసి మినీ అంగన్‌వాడీ టీచర్లను మెయిన్ అంగన్‌వాడీ టీచర్లుగా గుర్తించాలని అ సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో మినీ అంగన్‌వాడీలో టీచర్, ఆయా పనులు చేసుకుంటూ ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. రాష్ట్రంలో చిన్న చిన్న తండాలను సైతం పంచాయతీలుగా మార్చిన కేసీఆర్ మినీ అంగన్‌వాడీలను కూడా ఎలాంటి షరతులు లేకుండా ప్రధాన అంగన్‌వాడీలుగా గుర్తించాలని కోరారు. చాలీచాలని జీతాలతో మినీ అంగన్‌వాడీ టీచర్లు కాలం వెల్లదీస్తున్నారన్నారని చెప్పారు. తమ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చూడాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షురాలు ఎ.వరలక్ష్మి, రంగారెడ్డి జిల్లా మినీ అంగన్‌వాడీ అధ్యక్షురాలు భారతి, సభ్యులు మహేశ్వరి శంకరమ్మ, హేమలత, శమంత, అనురాధ పాల్గొన్నారు.

మద్యం మత్తులో కిందపడి కూలీ మృతి

మర్పల్లి: మద్యం మత్తులో ఓ కూలీ కింద పడి మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని పట్లూర్ గ్రామంలోని వ్యవసాయ పొలాల వద్ద గురువారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రం కుంచారం తాలూకా లక్ష్మీనగర్‌కు చెందిన బుద్ధారం నర్సింహులు (50) బతుకుదెరువు నిమిత్తం మర్పల్లి మండలం పట్లూర్ గ్రామానికి వచ్చి పశువులను కాస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం ఉదయం పశువులు మేపేందుకు వ్యవసాయ పొలాలవద్దకు వెళ్లాడు. మద్యం ఫుల్‌గా సేవించడంతో ప్రమాదవశాత్తు కింద పడి మృతిచెందినట్లు కుటుంబీకులు, పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అరుణ్‌కుమార్ గౌడ్ తెలిపారు.



సంధ్యా సమయాన. జాతర స్థలాన..



అమ్మవారిని తీసుకువస్తున్న భక్తులు

దుద్యాల మండల పరిధిలోని పోలెపల్లి ఎల్లమ్మ జాతరలో గురువారం సందడి మొదలైంది. ఆలయప్రాంగణంతోపాటు జాతర ప్రదేశమంతా దుకాణాలు వెలిశాయి. రాత్రి గ్రామ వీధుల గుండా అమ్మవారి వేంచేపు కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఇందులో ఆలయ మేనేజరు రాజేందర్‌రెడ్డి, చైర్మన్ ముచ్చటి వెంకటేశ్, సభ్యులు పాల్గొన్నారు. - బొంరాస్‌పేట